
'మంగమ్మా, చందూ ఫ్రెండ్ శ్రీనాథ్ వచ్చినట్లున్నాడు. కాఫీయిచ్చావా'' వంటింట్లోకి చూస్తూ అడిగింది సువర్చల. ''లేదమ్మా యిదుగో తెస్తున్నా'' కాఫీ కప్పులు ట్రేలో సర్ది గబగబా బయటకు తెచ్చిందామె.

''అయితే యిలా తే నే తీసికెళ్తాను.

శ్రీనాథ్‌తో మాట్లాడి చాలా రోజులయింది.'' అంటూ ఆమె చేతిలోంచి ట్రే తను తీసుకుంది సువర్చల. ''ఏందో అమ్మగారు లాంటి మంచి మనిషిని తనింతవరకు చూసి ఎరగదు. ఇంకొన్నాళ్ళు పోతే, నువ్వు కూర్చో మంగమ్మా నే వండి పెడతాలే అన్నా ఆశ్చర్యం లేదు. ఇంటి నిండా నౌకర్లున్నా నిమిసం కూడా వూరకుండరు'' తనలో తనే సువర్చల మెత్తని మనసుని తన భాషలో మెచ్చుకుంటూ లోపలికెళ్ళిందామె.



'అరగంటయింది మేడ మీద గదిలోకెళ్ళి ఏం చేస్తున్నారబ్బా యింత సేపు...' చిన్నగా పైకి మెట్లెక్క సాగింది సువర్చల.' చందూ మంచి తెలివైన వాడు అందుకే వాడి క్లాస్‌మేట్స్‌కే పాఠాలు చెబుతుంటాడు. వాడికన్నీ తండ్రి పోలికలే వచ్చాయి. వాడు ఆయన కంటే గొప్ప ఇంజనీర్ అవుతాడు. అదే తన తెలివితేటలు వచ్చి వుంటేనా......' ఆమె తన ఆలోచనలకి తనలో తనే నవ్వుకుంది.

సువర్చలది స్వచ్ఛమైన స్త్రీ హృదయం. అందుకే తనను తాను తక్కువ చేసుకుని భర్తని కొడుకుని గురించి ఉన్నతంగా ఆలోచించే ఔన్నత్యం ఆమెలో వుంది.

తలుపు దగ్గరగా వేసి వుంది. చిన్నగా నెట్టబోయిన సువర్చల శ్రీనాథ్ మాట వినిపించడంతో ఆగి పోయింది. ''ఒరేయ్ నువ్వీ మధ్య ఎందుకో డల్‌గా వుంటున్నావురా!'' శ్రీనాథ్ కంఠంలో ఆవేదన గుర్తించగలిగింది సువర్చల. ఆమె తలుపుతోసే ప్రయత్నం విరమించుకుని నిశ్చలంగా వుండిపోయింది.

అవును నిజమే! చందూ ఈ మధ్య ఎందుకో డల్‌గా కనిపిస్తున్నాడు. తనదే మాట ఆయనతో అంటే నీ తల్లి మనసుకి ఎప్పుడూ అలాగే అనిపిస్తుందిలే. అంతెందుకు దుక్కలా వున్న నన్ను పట్టుకుని చిక్కిపోతున్నారండీ మీరు అంటావ్. ముందు నీ కళ్ళు టెస్ట్ చేయించాలి పద పద డాక్టరు దగ్గరికి అంటూ నవ్వేస్తారు. యిప్పుడు తన మనసులో మాటే శ్రీనాథ్ అంటున్నాడు.'' ఆమె హృదయాంతరాల్లో సన్నగా ఆందోళన మొదలయింది.

''మాట్లాడవేరా నిన్నే అడిగేది'' శ్రీనాథ్ రెట్టిస్తున్నాడు.'' నీ మొహంలే నాకేమయింది. నేను బాగానే వున్నాను. నీకళ్ళకలా అనిపిస్తుందేమో'' తేలిగ్గా నవ్వేస్తూ అంటున్నాడు చందూ. కానిఅతని మాటల్లో కొంచెం తడబాటు దాగకుండా బయటపడుతోంది.

''లేదు చంద్రం! నాకళ్ళు నన్ను మోసం చేయలేవు. చూడు నీ కళ్ళలో అసలేమన్నా కాంతి వుందా. గాజు గోళీల్లా వున్నాయి. అంతెందుకు, నిన్న...... మన ఇంగ్లీష్ లెక్చరర్ నన్ను పిలిచి ఏమన్నారో తెలుసా ఏమయ్యా శ్రీనాథ్, మీ ఫ్రెండ్‌లో యిదివరకటి చలాకీ తనం లేదు. క్లాసులో కూడా యిది వరకులా ఫాస్ట్‌గా ఆన్సర్స్ చెప్పటం లేదు. మన్ను తిన్న పాములా వుంటున్నాడు. ఏదన్నా హెల్త్ ట్రబులా' అని అడిగారు. నేనేం చెప్పను. ఏం లేదు సార్ అంటూ మాట మార్చేసా.

''చంద్రం! నిజం చెప్పు. నాకు తెలుసు నువ్వు ఆంటీ అంకుల్‌తో అబద్ధం చెప్పినా, నాకు చెప్పలేవు. చెప్పరా ప్లీజ్...... చెప్పు...'' అతని కంఠంలోని ఆర్తికి సువర్చల హృదయం కరిగి నీరైంది.

''అరే ఎందుకు నన్నిలా విసిగిస్తున్నావ్. ఏం లేదని చెప్పాగా!'' చందు మాటల్లో విసుగు ధ్వనిస్తోంది. అతనెంత విసుక్కున్నా శ్రీనాథ్‌కి కోపం రావటం లేదు. పట్టు వదలని విక్రమార్కునిలా మళ్ళీ ప్రారంభించాడు.

''పోనీ వదిలేయ్ ఇది చెప్పు. నువ్వీ మధ్య చాలా సార్లు ఈవెనింగ్ క్లాస్ లెగ్గొడుతున్నావు. అదేమంటే తల నొప్పి అంటూ అబద్ధమాడుతున్నావ్. అంతే కాదు, ఆడర్టీ ఫ్రాగ్, రఫ్ ఫెలో, రాజీవ్ గాడితో స్నేహం చేస్తున్నావ్. ఈ పాన్ షాప్ మస్తాన్ గాడితో ఏదో గుసగుసలాడతావ్! ఏవిటిదంతా చంద్రం? ఎందుకు చేస్తున్నావిలా......'' చాలా ఆవేశంగా అడుగుతున్నాడు శ్రీనాథ్.

సువర్చల చేతిలో ట్రే వణుకుతుంది. ఇన్నాళ్ళూ తనంత అదృష్టవంతురాలు ఈ భూ ప్రపంచంలో వుండదని మురిసిపోయింది. ఆయనకి చెప్పినా నమ్మరు. అంత నమ్మకం ఆయనకి కొడుకు మీద యింకా...'' వాడి కన్నీ నా పోలికలే వచ్చాయి అంటావుగా. మరేం పర్లేదు. వాడేం చెడిపోడు. నామీద నమ్మకం లేదా నీకు అంటారు. చందూ ఏదన్నా చెడు దారిలో పయనిస్తున్నాడా' అదురుతున్న గుండె చిక్కబట్టుకుని ఆత్రుతతో చెవులు రిక్కించింది. సువర్చల.


''అవునురా నువ్వు చెప్పినవన్నీ నిజమే! అయితే ఏమంటావిప్పుడు?'' కోపంగా అడుగుతున్నాడు

''ఇక లాభం లేదు. యిప్పటి దాకా నువ్వే ఒప్పుకుంటావని చూశాను. నా నోటితోనే చెప్పిస్తున్నావు. నువ్వు డ్రగ్స్‌కి అలవాటు పడుతున్నావు కదూ చంద్రం? అది కూడా యిప్పుడిప్పుడే. ఆంటీ అంకుల్ గమనించకపోవచ్చు కానీ నేను కనిపెట్టాను. ఖచ్చితంగా నీలో ఆ లక్షణాలు కనిపిస్తున్నాయి.


* జడలో జాబిలి

కొత్త సీరియల్స్

* పార్ట్ టైమ్ హజ్బెండ్



# నీ కొడుకును నమ్మా నేను.....

చంద్రం నీ కోసం కాదురా, నీ కంట్లో నలుసు పడితేనే తల్లడిల్లిపోతుంది ఆ తల్లి. ఆమెకీ విషయం తెలిస్తే తట్టుకోగలదా. నీ మీదే తన ప్రాణాలన్నీ పెట్టుకున్న అంకుల్‌కీ సంగతి తెలిస్తే ఆయన బ్రతకగలరా. ఒక్కగానొక్క కొడుకువనీ పంచ ప్రాణాలూ నీ మీదే పెట్టుకుని బ్రతుకుతున్నారు వాళ్ళిద్దరూ. 'వాళ్ళకి' అన్యాయం చేస్తావా?

"చంద్రం! నీ లాంటి అమాయకుల్నీ, డబ్బు, పేరు వున్న ఇంటి పిల్లల్ని ఈ ఎర చూపించి తమ గుప్పిట్లో పెట్టుకుంటున్నార్రా ఆ మాస్త్రాన్ లాంటి స్వార్థపరులు. నీ జీవితం ఆ పాడు అలవాట్లకి బలై పోతుంటే నేను చూడలేనురా. నువ్వు మారాలి... చంద్రం నువ్వు మారాలిరా..." త్రినాథ్ ఆవేశంతో వణికి పోతున్నాడని అర్థమవుతోంది. అతని కంఠం గాద్గదికమైంది.

సువర్చల హృదయం మొద్దుబారిపోయింది. ఆమె చేతిలో ట్రే క్రింద పడి కప్పులు పగిలి చెల్లాచెదురయ్యాయి. రెండు చేతులతో తటాలున తలుపు తోసింది విసురుగా. అదురుతున్న పెదవుల్తో వణుకుతున్న శరీరంతో విస్పత్తువగా లోపలికి అడుగు పెట్టిందామె.

పగిలిన కప్పు తాలూకు ముక్క కాల్లో గుచ్చుకుని చివ్వున రక్తం పొంగింది. ఆమెకా విషయం తెలియడం లేదు. అంతకంటే ముందే ఆమె హృదయం భళ్ళున బద్దలైంది. దాని తాలూకూ రక్తం ఆమె కళ్ళలో ఎర్రజీరలై ప్రవహిస్తోంది.

"చందూ" ఆమె కంఠం ఆ గదిలో ప్రతిధ్వనిస్తోంది. ఉలిక్కిపడి చూశారు చందూ, త్రినాథ్. తల్లిని అలా చూసేసరికి చందూ హృదయం తల్లడిల్లిపోయింది. "అమ్మా ఏంటది, ఎందుకిలా అరిచావ్... అరెరె... రక్తం ఛూడు ఎలా పోతోందో ఆగు" అంటూ క్రిందికి వంగి ఆమె కాల్లోని ముక్కని తీసాడు. తన చేతిలో వున్న కర్చీఫ్ అతని కందించాడు త్రినాథ్. రక్తం రాకుండా గట్టిగా కట్టుకట్టాడు చందూ.

సువర్చల తలుపుకు ఆనుకుని. నిలబడి నిర్జీవంగా నవ్వింది. "చందూ, ఒరే బాబూ, త్రినాథ్ చెప్పింది విన్నాక నా ప్రాణాలే పోవాల్సిందిరా! చుక్క రక్తం కారితే ఏం ప్రమాదం లేదు లేరా."

చందూ, త్రినాథ్ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. "అమ్మా నువ్వు మా మాటలన్నీ విన్నావా" చిన్నగా అడిగాడు చందూ. ఆమె ఏం మాట్లాడలేదు. ఆమె తన గొంతునెవరో నులిమివేస్తున్నట్లు బాధపడుతోంది.

"ఒరే చందూ అంటే కొంచెం బాధపడినా, మన ప్రోగ్రాం మాత్రం గ్రాండ్ సక్సెస్ అవుతుంది. మనా నాటికకి ఫస్ట్ ప్రైజ్ గ్యారంటీ" మందస్మిత వదనంతో అన్నాడు త్రినాథ్.

"ఏమిటిరా త్రినాథ్ అనేది! నాకేమీ అర్థం కావడం లేదు" అయోమయంగా చూస్తూ అడిగింది సువర్చల.

"అవునమ్మా అదంతా నిజమనుకుంటున్నావా, రేపు మా కాలేజ్ డే కదా: మా క్లాస్ నుండి చిన్న నాటిక వేస్తున్నాం అందుకే త్రినాథ్, నేనూ, కలిసి రిహార్సల్స్ వేసుకుంటున్నాం. అవన్నీ విని నిజమే అనుకుని భయపడి పోయావ్" చిరునవ్వుతో తల్లిని చూస్తూ అన్నాడు చందూ. అతని మాటలు విన్నాక సువర్చల ప్రఫుల్ల వదనంతో అతన్ని చూస్తూ చందూ" అంది ఆప్యాయంగా.

"కానీ, అమ్మా నాటిక సంగతి తరువాత, నా జీవితం ఎంత విలువైందో నాకిప్పుడు అర్థమయిందమ్మా. నేను తెలివి తేటల్లో నాన్న పోలికే కావచ్చు. కాని ప్రవర్తన, క్రమశిక్షణ విషయంలో నీ కొడుకు నమ్మా నేను... నీ కొడుకుని" నీరు నిండిన కళ్ళతో అన్నాడు చందూ. ●

## అక్కకి నెల తప్పింది చెల్లెలికి వాంతులయ్యాయి

మెల్‌బోర్న్‌కు చెందిన టోరెప్ దంపతులకు ఒకే కాన్పులో పుట్టిన మెటిల్డా, సారా, ఇడెయా ముగ్గురు అక్కాచెల్లెలు తమ 21వ జన్మదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఇందులో మెటిల్డా, సారాల రంగు, రూపు, వ్యవహారాది అలవాట్లలో ఒకేలా వున్నాయి. మెటిల్డాకు కుడి చేయి వాటం అంతే భేదం. అయితే భోజనం, బట్టలు, సంగీతాభిలాష సారాతో సరిగ్గా పోలి వుంటాయి. సారా తన సోదరి గురించి ఇలాఅంటుంది. నన్ను చూసి మెటిల్డా అని అందరూ భ్రమిస్తారని అయితే మెటిల్డా అంటుంది తనకు గర్భం వచ్చిన రోజులలో (వైకలు) వాంతులు సారా కయ్యేవని.



సారా, మెటిల్డా, ఇడెయా

మెటిల్డా, సారా వివాహాలు అయ్యాయి. వీరిద్దరికన్నా చిన్నది ఇడెయా. తన అక్కల గురించి అంటుంది "అమ్మా, నాన్నల నుంచి దూరం కాక మునుపు నిద్రలోనే వీరిద్దరు ఒకరి ప్రశ్నకు మరొకరు జవాబు ఇచ్చుకునేవారని, నిద్రా భంగం లేకుండా అచేతనావస్థలోనే ఇదంతా జరిగేదని ఆమె చెబుతుంది.

– బివి